క్లుప్తంగా

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మోతీనగర్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్‌ ఉండదని విద్యుత్‌ ఏఈ రాకేష్‌గౌడ్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గాయత్రినగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాయత్రినగర్‌ పార్కు, హరిహర ఆలయం, గాయత్రినగర్‌ నాలా, లక్ష్మీనగర్‌, పర్వత్‌నగర్‌ ప్రభుత్వ హాస్పిటల్‌ ప్రాంతంలో, 11కేవీ ఎస్‌బీఐ కాలనీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కైత్లాపూర్‌ ఫ్లై ఓవర్‌, బ్యాంక్‌ కాలనీ, ఆర్‌ఆర్‌ఆర్‌ బార్‌ అండ్‌ రెస్టారెంట్‌, చందానాయక్‌ తండా ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ మహేందర్‌

మూసాపేట: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కార్పొరేటర్‌ మహేందర్‌ అన్నారు. మూసాపేటలోని బాబూ జగ్జీవన్‌ రామ్‌ బస్తీలో సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్కు ఇన్‌స్పెక్టర్‌ సుధాకర్‌, నాయకులు మల్లేష్‌, ఐలయ్య, జానకి, అబ్బాస్‌, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లో ప్రెషర్‌ సమస్య పరిష్కారానికి కృషి

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని గణేష్‌ నగర్‌లో మంజీరా వాటర్‌ లో ప్రెషర్‌ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. కాలనీ మహిళలు బుధవారం ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జలమండలి అధికారులు కాలనీకి వచ్చి సమస్యను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్‌, గణేష్‌ నగర్‌కాలనీ మహిళలు, పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి శుభాకాంక్షల వెల్లువ



టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జగదీశ్వర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏకాంత్‌ గౌడ్‌, విద్యాకల్పన తదితరులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జగదీశ్వర్‌ గౌడ్‌ను ఆయన నివాసంలో నియోజకవర్గ నాయకులు ఏకాంత్‌ గౌడ్‌, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌ పార్టీ ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భానుయాదవ్‌, గణేష్‌ గౌడ్‌, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఉపాధ్యక్షులు అశోక్‌, ప్రధాన కార్యదర్శి జితేందర్‌, డివిజన్‌ మహిళా అధ్యక్షురాలు నాగమణి, భూషణం, సంపంగి, యాదగిరి, బొట్టు శ్రీను, దయాకర్‌రెడ్డి, అంబికా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జగదీశ్వర్‌ గౌడ్‌కు బుధవారం ఆయన నివాసంలో వివేకానందనగర్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బాషిపాక నాగమణి, యాదగిరి, దొరపల్లి పరుశురాములు, నాగుల మల్లేష్‌, బొల్లం యాకయ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో జోష్‌

- టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా బండి రమేష్‌
- సన్మానించిన కాంగ్రెస్‌ శ్రేణులు

కూకట్‌పల్లి: తెలంగాణ పీసీసీ పదవుల్లో కార్యవర్గ విస్తరణలో కూకట్‌పల్లికి సముచిత స్థానం లభించింది. కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ని పార్టీ ఉపాధ్యక్షుడిగా అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్‌ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం వెలువెత్తింది. మూసాపేటలోని పార్టీ కార్యాలయంలో నాయకులు రమేష్‌ని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. 10 సంవత్సరాల తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీకి నగరంలో ఒక్క ఎమ్మెల్యే లేరు. దీంతో పార్టీ తరపున పోటీ చేసిన వారిని ఇన్‌చార్జీలుగా అధిష్టానం నియమించింది. దీంతో నియోజకవర్గాల్లో పార్టీకి కొంతమేర జోష్‌ వచ్చింది. కూకట్‌పల్లి నుంచి పోటీ చేసిన రమేష్‌ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. నాటి నుంచి నిత్యం పార్టీకి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య ఏదైనా పరిష్కరించేందుకు శక్తి మేర కృషి చేశారు. దీంతో ఆరు నెలల వ్యవధి లోనే జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో ఒక్క కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచే 20 వేల ఓట్లు అధికంగా సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా రమేష్‌ పార్టీని అంటిపెట్టుకొని ఉన్న విధానం, కార్యకర్తలకు అందుబాటులో ఉన్న తీరు, సమస్యల పరిష్కారం కోసం ఆయన చూపే చొరవ నిజాయితీ, పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధానం అధిష్ఠానం దృష్టిలో పడింది. మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో రమేష్‌ని మాత్రమే పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించేలా చేసింది. దివంగత కాంగ్రెస్‌ నేత మాజీ మంత్రి పి. జనార్ధన్‌ రెడ్డి మరణంతో ఉమ్మడి ఖైరతాబాద్‌ నియోజకవర్గ పరిధిలో సరైన నాయకత్వం లేక పార్టీ శ్రేణులు పూర్తిగా డీలాపడ్డాయి. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కాంగ్రెస్‌ నాయకులపై లెక్కకు మించి కేసులు పెట్టి వేధించి పార్టీని పూర్తిగా బలహీనపరిచింది. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తల పోరాటంతో ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో అధికారంలోకి రావటం మళ్లీ పార్టీ పునర్జీవం పొందినట్టైంది. నాటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి స్వయంగా రమేష్‌ని కూకట్‌పల్లి నియోజకవర్గంలో పోటీలో దించారు. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా రమేష్‌ ముందుండి పార్టీని నడిపిస్తున్నారు. ప్రజల కోసం, కార్యకర్తల కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.



మంత్రిని కలిసిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌

కూకట్‌పల్లి: టీపీసీసీ ఉపాధ్యక్షులుగా నియమితులైన బండి రమేష్‌ బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కష్టపడి పనిచేసి పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండాలని తుమ్మల నాగేశ్వరరావు బండి రమేష్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంసీ చైర్మన్‌ పుష్పారెడ్డి, కూకట్‌పల్లి మాజీ వైస్‌ చైర్మన్‌ లక్ష్మయ్య, శివ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సన్మానించిన నేతలు

టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన బండి రమేష్‌ని ఆయన నివాసంలో ఏ బ్లాక్‌ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌ రెడ్డి బుధవారం కలిసి సన్మానించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా ఆయన కృషి చేస్తారని తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. కార్యక్రమంలో బందిగా బాలనర్సింహ, ఆకుల నరేందర్‌, మాదరి శ్రీనివాస్‌, ముప్పూరి బాలరాజు, ఎస్‌కె హవాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

శెట్టి బలిజలను బీసీలో చేర్చేందుకు మద్దతిస్తున్నాం

పీఏసీ చైర్మన్‌ అరెకపూడి గాంధీ



ర్యాలీలో పాల్గొన్న పీఏసీ చైర్మన్‌ గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఐదేళ్లుగా రిజర్వేషన్లు, ప్రభుత్వ ఉద్యోగాలలో రాయితీలు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న శెట్టి బలిజలను బీసీలో చేర్చేందుకు పూర్తి మద్దతిస్తున్నామని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శెట్టి బలిజ కులాన్ని బీసీల్లో చేర్చాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ, తులసి వనం నుంచి బీసీ కమిషన్‌కు విన్నవించుకోవడానికి ర్యాలీగా వెళ్తున్న శెట్టి బలిజలకు కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, రావుల శేషగిరిలతో కలిసి ర్యాలీలో పాల్గొని ఆయన మద్దతు ఆయన మాట్లాడారు. 27 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించిన సమయం నుంచి అప్పటి ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చినప్పటికీ బీసీ జాబితాలో చేర్చలేదని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బీసీ కమిషన్‌ వినతిపత్రం తీసుకొని బీసీ జాబితాలో చేర్చుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీయూ సేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పిచ్చేటి మురళీ రామకృష్ణారెడ్డి, వైఎస్‌సీపీ రక్షణ సమితి అధ్యక్షులు చెల్లుబోయిన ఏసుబాబు, గాజుల రామారం శెట్టి బలిజ సంఘం అధ్యక్షులు రాయుడు గణపతి, కొండాపూర్‌ శెట్టి బలిజ సంఘం అధ్యక్షులు చెల్లుబోయిన హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ చార్జీలను ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కూకట్‌పల్లి: పెంచిన బస్‌పాస్‌ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని బుధవారం ఏబీవీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా రవాణాలో ప్రయాణిస్తూ చదువుకునే విద్యార్థుల బస్‌పాస్‌ చార్జీలు పెంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఉచిత బస్‌ల కారణంగా సరిపడా బస్సులు లేక విద్యార్థులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌ మహా నగర సంయుక్త కార్యదర్శి పడమటి భరత్‌, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాఘవేంద్ర, సిటీ టెక్నికల్‌ సెల్‌ కో కన్వీనర్‌ దుర్గప్రసాద్‌, శంకర్‌, రమేష్‌, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్‌ ర్యాలీ



ర్యాలీలో బీఆర్‌ఎస్‌ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌ తదితరులు

కుత్బుల్లాపూర్‌: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్‌ ప్రభుత్వం వేసిన జస్టిస్‌ పీసీ ఘోష్‌ కమిషన్‌ విచారణకు బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ హాజరు నేపథ్యంలో బుధవారం కుత్బుల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వివేకానంద్‌ ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్‌కే భవన్‌కు తరలి వెళ్లారు.

రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ



తారానగర్‌ కాలనీలో నిర్మిస్తున్న నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌ నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. తారానగర్‌ కాలనీలోని సాయిబాబా దేవాలయం వద్ద రూ.28.45 కోట్లతో చేపట్టిన నల్లగండ్ల చెరువు అలుగు నుంచి భెల్‌ కూడలిలోని గ్యాస్‌ గోడౌన్‌ వరకు ఉన్న నాలా విస్తరణ పనులలో భాగంగా నిర్మిస్తున్న ఆర్‌సీసీ బాక్స్‌ డ్రైన్‌ నిర్మాణం, ఆర్‌సీసీ బెడ్‌, సైడ్‌వాల్స్‌ నిర్మాణం, నాలా విస్తరణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఒకప్పుడు వరదలు వస్తే కంటి మీద కునుకు లేకుండా ప్రజలు తీవ్ర ఆందోళన చెందేవారని, కానీ నేడు ఆ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌డీపీ అధికారులు ఏఈ నిఖిల, యుగేందర్‌, పవన్‌, టౌన్‌ప్లానింగ్‌ అధికారులు, డిప్యూటీ సిటీ ప్లానర్‌ తులసిరామ్‌, టీపీఎస్‌ జీషన్‌, టీపీఎస్‌ సంతోష్‌, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధుల మంజూరు కోసం వినతి



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్‌ మహేందర్‌

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్‌ కొడిచెర్ల మహేందర్‌ వినతిపత్రం అందజేశారు. 44 సంవత్సరాల క్రితం నిర్మించిన కబీర్‌నగర్‌ కమ్యూనిటీ హాలు శిథిలావస్థకి చేరి కూలిపోయే పరిస్థితి ఉందని, వెంటనే నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని అన్నారు. మూసాపేట జడ్సీ కార్యాలయం నుంచి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ముందు నుంచి కూకట్‌పల్లి బస్సు డిపో నాలా వరకు వరద నీటి కాలువకు నిధులు మంజూరు చేయాలని, కబీర్‌నగర్‌ నాలా విస్తరణ మూలంగా కొన్ని కుటుంబాలకు అప్రోచ్‌ రోడ్డు లేకుండా పోయిందని, వెంటనే నాలా పై కప్పు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

భూముల వేలం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం



కార్యకర్తలను పరామర్శిస్తున్న మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: పేదలకు చెందాల్సిన కూకట్‌పల్లి హౌసింగ్‌ బోర్డు భూములను వేలం వేయడం కాంగ్రెస్‌ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. భూముల వేలానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్తలను బుధవారం పోలీసులు అరెస్టు చేసి కేపీహెచ్‌బీ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఆయన కార్యకర్తలను పరామర్శించి మాట్లాడారు. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ స్థలాలను వేలం పేరుతో కాంగ్రెస్‌ పార్టీ వ్యాపారం చేస్తుందని ఆరోపించారు. ఎన్నికల్లో 420 హామీలను అమలు చేసేందుకు ఇలాంటి నీచ స్థితికి దిగజారిన రేవంత్‌ రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. ఆ స్థలాలను ఇందిరమ్మ ఇళ్లకు కానీ, కాలనీ ప్రజల సౌకర్యార్థం పార్కుగా కానీ తీర్చిదిద్దాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మధుగౌడ్‌, వినోద్‌ కుమార్‌ గౌడ్‌, నాయకులు గోపి, గురుప్రసాద్‌, తోట రమేష్‌, వెంకటరమణ, సత్యనారాయణ, రాములు, అనిల్‌, అనూష్‌, రేవతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం స్వాధీనం



మోతీనగర్‌: గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన అల్లాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. అల్లాపూర్‌ సీఐ సామల వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. ఈ నెల 9న రాత్రి విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ లాలు నాయక్‌కు ఓ వృద్ధుడు మృతి చెంది ఉన్నాడన్న సమాచారం అందింది. వెంటనే 108కు సమాచారం అందించి అంబులెన్స్‌లో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. సుమారు 60 సంవత్సరాలు ఉన్న వృద్ధుడు తెల్లని జుట్టు, చామనచాయ రంగు, కుడి కాలికి నల్లని దారం కట్టి ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నూకర్‌ గేమ్‌ ప్రారంభించిన కార్పొరేటర్‌

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ఉరుకుల పరుగుల జీవితంలో కొంత సమయం గేమ్స్‌, ఆధ్యాత్మికత కోసం యువత సమయం కేటాయించుకోవాలని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ అన్నారు. బుధవారం మల్లికార్జున నగర్‌ రమ్య నర్సింగ్‌ హోమ్‌ ఎదురుగా ఏర్పాటు చేసిన స్నూకర్‌గేమ్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో మన్నే ఉదయ్‌యాదవ్‌, కర్రె జంగయ్య, బుర్రి యాదగిరి, మేకల హరినాథ్‌, మోహన్‌, సోఫీ, ప్రవీణ్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్‌ లేని స్కూల్‌ బస్సులు సీజ్‌



కేపీహెచ్‌బీకాలనీ: సరైన అనుమతి పత్రాలు లేకుండా, కనీసం ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్‌ లేకుండా తిరుగుతున్న మూడు స్కూల్‌ బస్సులను కూకట్‌పల్లి రోడ్డు రవాణా ప్రాంతీయ కార్యాలయ మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనుబాబు ఆధ్వర్యంలో బుధవారం సీజ్‌ చేశారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమైన తరువాత స్కూల్‌ బస్సులను స్పెషల్‌ డ్రైవ్‌ ద్వారా తనిఖీలు చేపట్టారు. అదే విధంగా పన్నులు చెల్లించని మరో రెండు వాహనాలను కూడా సీజ్‌ చేసినట్లు తెలిపారు.

శంషాబాద్‌ ఎయిర్‌పోర్టుకు ప్రతి 15 ని.లకు ఏసీ బస్సు

మియాపూర్‌: ఆర్టీసీ మియాపూర్‌- 2 డిపో పరిధిలో లింగంపల్లి నుండి శంషాబాద్‌ ఎయిర్‌పోర్టుకు నూతనంగా నాలుగు పుష్పక్‌ ఏసీ బస్సులు నడుస్తున్నాయని మియాపూర్‌-2 డిపో మేనేజర్‌ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి- చందానగర్‌, ఆల్విన్‌ ఎక్స్‌ రోడ్డు, హఫీజ్‌పేట్‌, కొండాపూర్‌, కొత్తగూడ, గచ్చిబౌలి మీదుగా శంషాబాద్‌ ఎయిర్‌పోర్టుకు పుష్పక్‌ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఉదయం 5.45 నిమిషాలకు, చివరి బస్సు రాత్రి 8.45ని.లకు బయల్దేరతాయి. అలాగే ప్రతి 25 ని.లకు ఓ బస్సు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అదేవిధంగా మియాపూర్‌ నుండి ఎయిర్‌పోర్టుకు ప్రతి 15నిలకు బస్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మియాపూర్‌ నుండి జేఎన్‌టీయూ, శిల్పారామం, హైటెక్‌సిటీ, రాయదుర్గం, బయోడైవర్సిటీ, గచ్చిబౌలి మీదుగా శంషాబాద్‌ ఎయిర్‌పోర్టు వరకు పుష్పక్‌ ఏసీ బస్సులు నడపబడుచున్నాయని తెలిపారు. మొదటి బస్సు అర్ధరాత్రి 12.15ని.లకు, చివరి బస్సు రాత్రి 11.45ని.లకు బయల్దేరనున్నట్లు తెలిపారు.

'సండే ఈవినింగ్‌ టాక్‌'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్‌ టాక్‌' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'సక్సెస్‌ త్రూ సైలెన్స్‌' అనే అంశంపై బ్రహ్మకుమారీస్‌ సంస్థ రూరల్‌ అండ్‌ అగ్రికల్చర్‌ డెవలప్‌మెంట్‌ వింగ్‌, సెక్యూరిటీ సర్వీసెస్‌ వింగ్‌ అండ్‌ ఐటీ వింగ్‌కు ముంబాయి చెందిన బి.కె.క్రీనా ఉపన్యసిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

చండీహోమం



రాయదుర్గం: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గణపతి, కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవికి అర్చనలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. చండీ హోమం, రుద్రహోమం, నారాయణ హోమం చేశారు.

ప్రాజెక్టు నిర్మించడమే కేసీఆర్‌ చేసిన తప్పిదమా?



బీఆర్‌కే భవన్‌కు తరలివెళ్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, బీఆర్‌ఎస్‌ శ్రేణులు



ఓల్డ్‌ బోయిన్‌పల్లి నుంచి తరలివెళ్తున్న కార్పొరేటర్‌ నర్సింహయాదవ్‌ తదితరులు

- కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే ప్రజలకు మేలు
- కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రజలు నేడు సుభిక్షంగా పంటలు పండిస్తున్నారంటే అది కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమే అని, ప్రాజెక్టు నిర్మించడమే కేసీఆర్‌ చేసిన తప్పిదమా? అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేసీఆర్‌కు మద్దతుగా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని క్షమించరని, నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న నినాదంతో కేసీఆర్‌ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ చేస్తున్న ఆరోపణలకు దీటుగా సమాధానం కేసీఆర్‌ ఇస్తారని, ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. ఇప్పటికే కాంగ్రెస్‌ పార్టీ పాలనతో ప్రజలు విసుగెత్తి పోయారని, గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ కో ఆర్డినేటర్‌ సతీష్‌ అరోరా, కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్‌, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌ గౌడ్‌, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష బాబురావు, సబిహా బేగం, మహేశ్వరి శ్రీహరి, మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్‌లు శ్రావణ్‌కుమార్‌, పగుడాల బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు ..

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్‌ పార్టీ అసత్య ఆరోపణలు చేయడం సరికాదని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ అన్నారు. కాళేశ్వరంపై బీఆర్‌కే భవనంలో జరిగే విచారణకు కేసీఆర్‌ హాజరయ్యారు. ఆయనకు సంఘీభావంగా డివిజన్‌ నుంచి బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలు దేరారు. కార్యక్రమంలో మేకల హరినాథ్‌, కర్రె జంగయ్య, మన్నె ఉదయ్‌యాదవ్‌, బుర్రి యాదగిరి, మక్కాల సత్యనారాయణ, నాగేష్‌, శ్రీను పాల్గొన్నారు.